ప్రజావాణికి 156 దరఖాస్తులు

- కుటుంబ సభ్యులపై అర్జీలు వస్తే కౌన్సెలింగ్ ఇవ్వాలి
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, జనవరి 27: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో 156 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ సత్యశారద స్వయంగా వినతులు స్వీకరించారు. తమకు ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండగా, ఐదు నెలల బడ్జెట్ వచ్చినప్పటికీ చెల్లించడంలేదని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని డీఎంహెచ్‌వో పరిధిలో పనిచేస్తున్న 33మంది అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు కలెక్టర్‌ను విన్నవించారు. అలాగే ఏడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నందున పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి కిరాయిలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని, మంజూరు చేయించాలని 104 ఉద్యోగులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పైడిపల్లి శివారు సర్వే నంబర్లు 1242/1243లో ఆర్టీసీ సొసైటీ చేసిన వెంచర్‌లో 2వేల గజాలు పార్క్ స్థలం కేటాయించారని, ప్రస్తుతం ఆ స్థలాన్ని ప్రకాశ్‌రావు అనే వ్యక్తి కబ్జా చేసి ఇసుక, మొరం నిల్వలు చేస్తున్నాడని స్థానికులు స్వామి, ప్రతాప్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జా చేసిన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అధికారులు స్పందించి స్థలం అన్యాక్రాంతం కాకుండా అడ్డుకొని బస్తీ దవాఖాన లేదా, ఓపెన్ జిమ్, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. శ్మశాన వాటికకు వెళ్లకుండా ఇద్దరు వ్యక్తులు రోడ్డుకు అడ్డంగా గుడిసెలు వేశారని రాయపర్తి మండలంలో జంకురాంతండాకు చెందిన యాకూబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఇద్దరు ప్రభుత్వ భూమిలో మట్టి క్రమంగా తవ్వి విక్రయించారని, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన దివ్యాంగులు కుమారస్వామి, వెంకట్ కలెక్టర్‌ను కలిసి ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయించాలని వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూశాఖకు చెందినవి 48, డీఆర్డీవోకు 15, జీడబ్ల్యూఎంసీకి 13, జడ్పీ సీఈవోకు 14 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. కుటుంబ సభ్యులపై వచ్చిన వినతులపై వెంటనే స్పందించి కౌన్సెలింగ్ నిర్వహించాలని డీడబ్ల్యూవోకు సూచించారు. అవసరమైతే పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్డీవో కౌసల్యాదేవి, వరంగల్, ఖిలావరంగల్ తహసీల్దార్లు ఎండీ ఇక్బాల్, బండి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద

ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి

వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ ప్రాక్టికల్స్‌పై సంబంధిత అధికారులతో సమీక్షలో ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 1,496 మంది ప్రథమ సంవత్సరం, 3,484 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరు కానున్నారని, నాలుగు విడుతల్లో జరిగే ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ అధికారులతో సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు నుంచి గోదావరి నీటి కాల్వల ద్వారా వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లో త్వరగా భూసేకరణ నోటిఫికేషన్ వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. నర్సంపేట డివిజన్‌లోని నల్లబెల్లి, దుగ్గొండి, నర్సంపేట మండలాల్లో దేవాదుల ఫేస్ -3, ప్యాకేజ్-5 ప్రాజెక్టు కాల్వ పనులు చేపట్టి 25,550 ఎకరాలకు సాగునీరు అందించేందుకు 500 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటికే 432 ఎకరాల సేకరణ పూర్తయిందన్నారు. అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, ఇన్‌చార్జి డీఐఈవో మాధవరావు, డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ సీతారాం పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

వరంగల్: బల్దియా గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన అర్జీలపై వింగ్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ఆమె నగర వాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ పుప్పాలగుట్ట ప్రాంతంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలని న్యాయవాది కమల్‌కిశోర్ కమిషనర్‌కు విన్నవించారు. 26వ డివిజన్ పరిధిలోని రామవారి వీధిలో రోడ్డు విస్తరణ పనులు నిలిపివేయాలని స్థానికులు కోరారు. విస్తరణలో చాలామంది నిరుపేదల ఇళ్లు సగం వరకు పోయే ప్రమాదం ఉందని వివరించారు. కాశీబుగ్గ వివేకానంద కాలనీలో సీసీరోడ్లు నిర్మించాలని కాలనీవాసులు కోరారు. పోచమ్మమైదాన్ జంక్షన్‌లో పెద్ద కర్రలతో ఫ్లెక్సీల ఏర్పాటుతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, మూడు రోజుల కంటే ఎక్కువగా ఉంచకుండా చర్యలు తీసుకోవాలని ఆటోడ్రైవర్స్ యూనియన్ నేతలు ఫిర్యాదు చేశారు. కేయూ కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలని కాలనీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి రాజ సుధాకర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. 4వ డివిజన్ జ్యోతిరావు పూలేకాలనీలో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని వినతిపత్రం ఇచ్చారు. జవహర్ కాలనీ రోడ్ నంబర్-8లో డ్రెయినేజీ నిర్మించాలని, కాలనీవాసులు కంట్రిబ్యూషన్ చెల్లిస్తామని విన్నవించారు. అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, హెచ్‌వో రమేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ఎంహెచ్‌వో రాజేశ్, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షతగాత్రులకు నన్నపునేని పరామర్శ

వరంగల్ చౌరస్తా, జనవరి 27: హనుమకొండ జిల్లా కమలాపురం మండలం అంబాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతురాలి కుటుంబ సభ్యులు, క్షతగాత్రులను తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరామర్శించి ఓదార్చారు. సోమవారం సాయంత్రం వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటో ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడిన హుస్సేన్‌బీ(45) వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతదేహాన్ని మార్చురీలో సందర్శించి, కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రమాదంలో గాయాలపాలై ఎంజీఎం అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలిసి ధైర్యం చెప్పారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రమాదం జరిగిన తీరును పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంజీఎం క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్, వైద్యాధికారులు, బీఆర్ఎస్ కార్పొరేటర్ సిద్దం రాజు పాల్గొన్నారు. కాగా, క్షతగాత్రులను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎంజీఎం దవాఖానలో పరామర్శించారు.

క్షతగాత్రులను ఆరోగ్యస్థితిని అడిగి తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వాటర్‌సప్లై కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేట, జనవరి 27: తమ సమస్యలు పరిష్కరించాలని నర్సంపేట మున్సిపాలిటీ వాటర్‌సప్లై కార్మికులు ఎండీ మాషుక్, నాయిని సతీష్ కోరారు. సోమవారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబర్లు 14, 60 ద్వారా తమ వేతనాలు పెంచాలని కోరారు. మున్సిపాలిటీ వాటర్‌సప్లై కార్మికులు గంగారపు ప్రకాశ్, గూడెపు సూరయ్య, నరేందర్, రాజశేఖర్, నాతి రాజు, వేమ రంజిత్ ఉన్నారు.

ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వాటర్‌సప్లై కార్మికులు

సోలార్ పవర్ ప్లాంట్ స్థల పరిశీలన

సంగెం/ గీసుగొండ, జనవరి 27: సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి సంగెం మండలం నల్లబెల్లి, గీసుగొండ మండలం కోనాయిమాకులలో సోమవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. స్వయం సహాయక మహిళా సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణాలు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. రెడ్కో జిల్లా మేనేజర్ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ రాజ్‌కుమార్, నాయకులు మాధవరెడ్డి, జనగాం రమేశ్, కేశవులు, కొట్టం సంపత్, గీసుగొండ తహసీల్దార్ రీయాజుద్దీన్, ఏపీఎం సురేశ్, ఆర్ఐ సాంబయ్య పాల్గొన్నారు.

అధికారులతో చర్చిస్తున్న పరకాల ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

కలెక్టరేట్‌లో టీజీవో డైరీ ఆవిష్కరణ

ఖిలావరంగల్, జనవరి 27: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీని కలెక్టర్ సత్యశారద సోమవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్మోహన్‌రావు, అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, టీజీవో రాష్ట్ర ప్రచార కార్యదర్శి అస్నాల శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శి కోల రాజేశ్, టీజీవో జిల్లా కార్యదర్శి ఫణికుమార్, కోశాధికారి ఈగ వెంకట్, హనుమకొండ నేతలు మురళీధర్‌రెడ్డి, ప్రవీణ్, భాగ్యలక్ష్మి, రాంచందర్‌రావు, సుధీర్‌కుమార్, విజయనిర్మల, హేమలత పాల్గొన్నారు.

నక్షా ప్రాజెక్టు వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎంపిక

నక్షా (నేషనల్ జియోగ్రాఫిటల్ నాలెడ్జ్) పైలట్ ప్రాజెక్టుకు వర్ధన్నపేట మున్సిపాలిటీ ఎంపికైనట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో నక్షా పైలట్ ప్రాజెక్టు ఎంపికపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో సర్వే నిర్వహించేందుకు ఎనిమిది మందితో సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ ఈ సుధీర్‌కుమార్, దేవరాజ్, డీపీవో కల్పన, ఆర్ అండ్ బీ ఈఈ జితేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ సీతారం, ఏసీపీ నర్సయ్య కమిటీలో సభ్యులుగా కొనసాగుతారని తెలిపారు. ఈ సర్వే కోసం సంబంధిత అధికారులు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

వరంగల్ కలెక్టరేట్‌లో టీజీవో డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యశారద

ఎఫ్‌టీఎల్ సర్వేకు రూ.28,78,289 కేటాయింపు

లోకాయుక్తలో వరంగల్ ఆర్‌డీఓ సత్యపాల్‌రెడ్డి వెల్లడి

కాశీబుగ్గ, జనవరి 27: గ్రేటర్ వరంగల్ పరిధిలోని చెరువులకు ఎఫ్‌టీఎల్ సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసేందుకు నీటిపారుదలశాఖకు రూ.28లక్షల 78వేల 289 నిధులు కేటాయించినట్లు వరంగల్ ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి లోకాయుక్తకు వెల్లడించినట్లు వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ పరిధిలోని చిన్నవడ్డెపల్లి చెరువు, బెస్తంచెరువు, కోటచెరువు, రామసముద్రం చెరువు, కట్ట మల్లన్నచెరువు, చెన్నంగి చెరువు, భద్రకాళీ చెరువుల కబ్జాలపై లోకాయుక్త కోర్టులో విచారణ జరుగుతోందని తెలిపారు. వరంగల్ ఆర్డీఓ లోకాయుక్త రిజిస్ట్రార్‌కు ఇచ్చిన రిపోర్ట్ ఇచ్చారు. దాని ప్రకారం చెరువుల ఎఫ్‌టీఎల్ సర్వే కోసం కార్పొరేషన్ ప్రొసీడింగ్స్ నంబర్ G1/65357/2024, 2024 జూలై 26న రూ.28లక్షల 78వేల 289 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, నీటిపారుదలశాఖకు ఇచ్చినట్లు అందులో పేర్కొన్నారు. నీటిపారుదలశాఖ అధికారులు ఎఫ్‌టీఎల్ సర్వే తర్వాత చెరువుల కబ్జా తొలగిస్తామని రెవెన్యూ డివిజనల్ అధికారి లోకాయుక్తకు రిపోర్ట్ ఇచ్చినట్లు వెల్లడించారు. ఆ రిపోర్ట్‌పై అభ్యంతరాలను వినియోగదారుల మండలి ఈనెల 30న లోకాయుక్తకు అందిస్తామని ఆయన తెలిపారు.

జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

నర్సంపేట, జనవరి 27: మండలంలోని లక్నెపల్లిలో జిల్లా ఉత్తమ అవార్డు గ్రహీతను మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు సోమవారం సన్మానించారు. లక్నెపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్నారు. ఈమేరకు సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. గ్రామ పెద్దలు కత్తి కిరణ్‌కుమార్, ఐలోని అశోక్, ఇట్టబోయిన వెంకటయ్య, వీవోఏ పిండి శ్రీనివాస్, కత్తి రాజు ఉన్నారు.

అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు

అయోడిన్ లోపంపై జాగ్రత్తలు తీసుకోవాలి

నర్సంపేట, జనవరి 27: అయోడిన్ లోపంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐటీసీ, ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా సహకారంతో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలకు అయోడిన్ లోపం, రుగ్మతలు, పౌష్టికాహారం ఆవశ్యకతపై సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అయోడిన్ లోపంతో గర్భిణులు, బాలింతలు, కౌమార బాలబాలికలు అనేక రుగ్మతలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దయాకర్ మాట్లాడుతూ ఉప్పు లోపంతో థైరాయిడ్, గాయిటర్ వంటి వ్యాధులు వస్తాయని, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు, రాజేందర్, జయరాజ్, వసంత, సరోజ, నవీన్‌చంద్ర, రాజు, ఉష, విజయ్‌కుమార్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాశ్

రాజ్‌కుమార్ చారికి ఘన నివాళి

నర్సంపేట, జనవరి 27: పట్టణంలోని ప్రధాన రహదారిలో తెలంగాణ అమరుడు తొగిటి రాజ్‌కుమార్ చారి విగ్రహం వద్ద వర్ధంతి సోమవారం జరిగింది. విగ్రహానికి డివిజన్ స్వర్ణకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామోజు లక్ష్మీపతి, శ్రీరామోజు జయకుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమంలో బలిదానం చేసుకున్న అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఆ సంఘం నాయకులు శ్రీరామోజు మురళి, కోమాండ్ల గణేశ్, కొల్లూరి రాజు, శంకరభక్తుల శివ, కొండోజు కార్తీక్, నీలోజు భాస్కరచారి, ముదురుకోళ్ల రాజేందర్, బోగోజు సాంబయ్య ఉన్నారు.

రాజ్‌కుమార్‌చారి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న స్వర్ణకార సంఘం నాయకులు

ఇందిరమ్మ ఇళ్లలో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి

కాశీబుగ్గ, జనవరి 27: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యమివ్వాలని బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కాశీబుగ్గలో తెలంగాణ మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నందున ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు. విద్యా, వ్యాపారం, రాజకీయంగా చాలా వరకు వెనుకబడిన బీసీలను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. భిక్షపతి, పెద్ద గణేశ్, ప్రభాకర్, చిన్న గణేశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

మున్నూరుకాపు కృషి పరపతి సంఘం నూతన కమిటీ ఎన్నిక

కరీమాబాద్, జనవరి 27: మున్నూరుకాపు కృషి పరపతి సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక జన్మభూమి జంక్షన్‌లోని అన్నపూర్ణ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా కోల జనార్దన్, అధ్యక్షుడిగా పెంచాల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా కోల కృష్ణ, సహాయ కార్యదర్శిగా కొమ్మిని రాజేందర్, కోశాధికారిగా చిట్ల శ్రీనివాసులు, సహాయ కోశాధికారిగా బొల్లం రవికుమార్, ఆర్గనైజర్లుగా తంగెళ్ల సదానందం, తోట మధు, పర్ష వీరన్న, పార్వతీ కృష్ణంరాజు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తోట రవీందర్, కొమ్మిని రాజేందర్ తెలిపారు.

మాట్లాడుతున్న నర్సయ్య

విశ్వబ్రాహ్మణులకు అవకాశం ఇవ్వాలి

సంగెం, జనవరి 27: స్థానిక సంస్థల ఎన్నికల్లో విశ్వబ్రాహ్మణులకు అవకాశం ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బండ్లోజు నరసింహాచారి కోరారు. మండలంలోని గవిచర్లలో విజ్ఞానపీఠం కమ్యూనిటీ హాల్‌లో క్యాలెండర్ ఆవిష్కరణ సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా, సామాజికంగా విశ్వబ్రాహ్మణులు వెనుకబడి ఉన్నారని, స్థానిక ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి సతీష్‌కుమార్, కోశాధికారి సదాశివుడు, సంగెం మండల అధ్యక్షుడు కాగితాల జగన్నాథచారి, కోదండరాములు, రాజు, శ్రీనివాస్, ప్రసాద్, శశిధర్, ప్రశాంత్, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బస్టాండ్‌లో ఎమ్మెల్యే భర్త బర్త్ డే వేడుకలు

ఇబ్బందులు పడిన ప్రయాణికులు

రాయపర్తి, జనవరి 27: పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి భర్త హనుమాండ్ల రాజా రామ్మోహన్‌రెడ్డి బర్త్ డే వేడుకలు సోమవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించగా ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టెంట్లు, కుర్చీలు వేసి సభ ఏర్పాటు చేయగా, పార్టీ శ్రేణులు, వాహనాలను బస్టాండ్ ఆవరణలో పార్కింగ్ చేశారు. పోలీసులు మోహరించారు. దీంతో ఆర్టీసీ బస్సులు రహదారిపైనే నిలిపివేయగా ప్రయాణీకులు పరుగులు తీశారు. ఎండ తీవ్రతకు ప్రయాణికులు బస్టాండ్‌లో కూర్చునే వీలు లేక అసహనం వ్యక్తం చేశారు.

మున్సిపల్ ప్రత్యేక అధికారిగా సంధ్యారాణి

బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

నర్సంపేట/ వర్ధన్నపేట, జనవరి 27: పాలక వర్గం గడువు ముగియడంతో నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ సంధ్యారాణి నియామకమయ్యారు. ఈమేరకు సోమవారం నర్సంపేట పట్టణంలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ జోనా, మున్సిపల్ ఉద్యోగులు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

నర్సంపేట, జనవరి 27: నర్సంపేట పట్టణంలోని బాలికల మైనార్టీ గురుకులంలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌ల్లో అడ్మిషన్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్ బీ శ్రీపాల సోమవారం తెలిపారు. మైనార్టీ, నాన్ మైనార్టీ విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం సెల్ నంబర్ 79950 57978లో సంప్రదించాలని పేర్కొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

గీసుగొండ, జనవరి 27: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట గ్రామ యువతకు ప్రముఖ వ్యాపారవేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి సొంత ఖర్చుతో వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలకు సంబంధించిన సామగ్రితోపాటు ఎల్ఈడీ లైట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ యువత క్రీడలతో సామాజిక సేవా గుణం కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు వినియోగించుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ కవితా రాజ్‌కుమార్, నాయకులు మర్రెడ్డి, అనిల్, సునీల్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు సతీష్ ఎంపిక

గిర్మాజీపేట, జనవరి 27: ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, భారతీయ భాష సంస్థ నిర్వహణలో మద్రాస్ క్రైస్తవ కళాశాలలో ఈనెల 29, 30 తేదీల్లో తలపెట్టిన ద్రవిడ భాషల్లో ప్రాచీన కావ్యాలు - తులనాత్మకత అంతర్జాతీయ సదస్సుకు శ్రీవిశ్వేశ్వర సంస్కృతాంధ్ర డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సోనబోయిన సతీష్ ఎంపిక య్యారు. తెలుగు- తమిళ సంస్కృతులు- తులనాత్మక పరిశీలన అంశంపై పత్ర సమర్పణ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.

NT-327012-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

వ్యవసాయ మోటర్ చోరీ

నర్సంపేట, జనవరి 27: పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌లో వ్యవసాయ మోటర్ చోరీకి గురైన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. పట్టణానికి చెందిన గుర్రపు రమాదేవికి ఎన్‌టీఆర్ నగర్‌లో వ్యవసాయభూమి ఉంది. పొలం పక్కనున్న కాల్వలో వ్యవసాయ మోటర్ ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. సోమవారం బాధితురాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

వివాహిత అదృశ్యం

నర్సంపేట, జనవరి 27: పట్టణానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైనట్లు సోమవారం కేసు నమోదైంది. ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపురం మండలం మనుబోతులగడ్డకు చెందిన ఖరీంపాషా తన కూతురు హసీనా (వివాహిత)ను ఆమె స్నేహితురాలిని కలిసేందుకు హైదరాబాద్‌కు వెళ్తా అనడంతో ఆదివారం ఉదయం ఆర్టీసీ బస్సు ఎక్కించాడు. కానీ స్నేహితురాలి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వివాహిత మహిళ కోసం వెతికారు. ఆచూకీ లభించలేదు. తండ్